తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## 17న రాకెట్ ప్రయోగంపై షార్‌లో ఆసక్తి

### - విజిటర్స్ గ్యాలరీకి ఆహ్వానించిన షార్ యాజమాన్యం



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి ఈ నెల 17న జరగనున్న ఇన్‌శాట్ 3డిఎస్ ఉపగ్రహ ప్రయోగానికి సంబంధించి షార్‌లో సందడి నెలకొంది. ఇక్కడి రెండవ ప్రయోగ వేదిక వద్ద తుది ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిఎస్ఎల్‌వి ఎఫ్14 రాకెట్ ద్వారా ఈఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా ఒకే ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నట్లు ఇప్పటిదాకా అందిన సమాచారం. ప్రయోగ వీక్షణ కోసం షార్ అధికారులు సోమవారం విజిటర్స్‌ను ఆహ్వానించారు. లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి రాకెట్ ప్రయోగాన్ని చూసేందుకు ఉత్సాహవంతులైన వారు సోమవారం సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభించారు. ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది.

## శివయ్య సేవలో ఇటలీ భక్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. వేలాది రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. అలాగే సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కావటంతో విశేష సంఖ్యలో అబిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఇటలీకి చెందిన 15 మంది భక్తులు ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది ప్రాధాన్యతను వివరించారు. వారు ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయాధికారులు ఏర్పాట్లు చేసారు. పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు.

### ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా

## కృషి చేయాలి

### అదనపు సిఈఓ హరీంద్ర ప్రసాద్




తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024 నేపథ్యంలో ఆర్ఓలు, ఎఆర్ఓలు ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా కృషి చేయాలని ఏపీ సిఈఓ కార్యాలయ అదనపు సిఈఓ హరీంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి సెమినార్ హాల్ నందు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి సూచనలు మేరకు ఏపి, సిఈఓ కార్యాలయం వారు ఎన్నికల సంసిద్ధత పై పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఓ, ఎఆర్ఓలకు మాస్టర్ లెవల్ ట్రైనర్స్ శిక్షణను ఏపి అదనపు సిఈఓ ప్రారంభించారు. శిక్షణ ఇచ్చిన జాతీయ మాస్టర్ ట్రైనర్లు అశ్విన్ మాలిక్, బిజిత్ కుమార్ ధార్, జ్ఞానవేలు, శశిశేఖర్ రెడ్డి, అచింత్య కుమార్, హజ్రాలతో కలిసి జాతీయ స్థాయి సర్టిఫికేషన్ శిక్షణ కార్యక్రమంలో ఆర్ఓలు, ఎఆర్ఓలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై పలు అంశాలపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు సిఈఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎలక్షన్ కమిషన్ నిబంధనలు మేరకు ఆర్ఓలు, ఎఆర్ఓలు ఎన్నికల విధానంపై సంపూర్ణ అవగాహన కలిగి, ఎన్నికల సజావుగా జరిగేలా బాధ్యత వహించాలని తెలిపారు. నేటి నుంచి 16వ తేది వరకు మొదటి దఫా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్, సూళ్లూరుపేట ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, చంద్రముని, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, బాపట్ల, పల్నాడు తదితర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఎఆర్ఓలు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాల కోట... నాయుడుపేట...!?



### అధికారుల నిర్లక్ష్యం -బరితెగిస్తున్న అక్రమార్కులు
### ప్రకృతి సంపద సొంతం -అధికార పక్షం సొంతం

( ప్రభాతవార్త - నాయుడుపేట )

తిరుపతి-నెల్లూరు-తమిళనాడులకు కేంద్ర బిందువైన నాయుడుపేట కేంద్రంగా అక్రమార్కులు ఇసుక, గ్రావెల్, మట్టి, ఎర్రచందనం, రేషన్‌బియ్యం ఏదోఒకచోటఅనునిత్యం అక్రమ రవాణా జరుగుతున్న నియంత్రించడంలో పోలీసులు-రెవెన్యూ -మైనింగ్ అధికారులు విఫలమౌతున్నారు.నాయుడుపేటలో ఇసుక-గ్రావెల్ ఇళ్ళప్లాట్లు చదును చేయుటకు మంచి గిరాకీ ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం జోరందుకుంది.నాయుడుపేటకు పొరుగు మండలానికి చెందిన ఓఅధికార పార్టీనేత కనుసన్నల్లో ఈ అక్రమార్కులు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.పార్టీలో నేను చెప్పిందే ఏదైనా జరగాలి, ఏ పని కావాలన్నా నాకు తెలిసి జరగాల్సిందే అన్న చందంగా ఆ నాయకుడు వ్యవహరిస్తూ వుండ టంతో పార్టీ ప్రజలనుంచి పలుఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటోంది. ఒక వైపు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలనే లక్ష్యంగా బాపూజీ కలలగన్న గ్రామస్వరాజ్యం వైపుఅడుగులు వేస్తూ అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. అయితే నాయుడుపేట పరిసరప్రాంతాల పకృతి సంపదైన గ్రావెల్,మట్టి, ఇసుకలను కొల్లగొడుతూ కోట్లుగడిస్తున్నా అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటో ఆ దేవుడికే తెలియాలి. ఇప్పటికే ఈ నేతపై కొందరు స్వంతపార్టీ నేతలే పార్టీఅధిష్టానంతోపాటు హైకోర్టుకు కూడ ఫిర్యాదులు చేశారు.ఈక్రమంలో రోసనూరు గ్రామసమీపంలోని ప్రభుత్వ భూముల్లో గత కొంతకాలం నుండి పగలురాత్రి తేడా లేకుండా ట్రిప్పర్లు,జెసిబిలతో గ్రావెల్-మట్టిని తరలి స్తున్నారు. నాయుడుపేటలో ఒకట్రిప్పర్ గ్రావెల్ 5000నుండి 10000వరకు డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. అదే విధంగా నాయుడుపేట, దొరవారి సత్రం,పెళ్ళకూరులో,స్వర్ణముఖి,కాళంగినదినుండి రాత్రిసమయంలో కొంతమంది అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ కోట్లు దోచేస్తున్నారు. దొరవారిసత్రం,నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో రేషన్‌బియ్యంను తక్కువ ధరలకు కొనుగోలుచేసి వాటిలో మరోసన్నరకం బియ్యంను కల్తీచేసి పాలిష్‌వేసి ఇతరప్రాంతాలకు తరలిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట పట్టణానికి చెందినజూదరులు, వ్యాపారస్తులు, ప్రభుత్వఉద్యోగస్తులుమండలంలోనిపూడేరు,బిరదవాడ,మేనకూరు అటవీప్రాంతాల్లో యధేచ్ఛగా పేకాట,కోడిపంధ్యాలు ఆడుతూ బెట్టింగులు నిర్వహిస్తూ లక్షలరూపాయలు పోగొట్టుకొని వారికుటుంబాలను వీధినపడేస్తున్నారు. వెంకట గిరి అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలను సేకరించి నాయుడుపేట మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలించి లక్షలరూపాయలు దోచుకుంటున్నారు. నాయుడుపేట కేంద్రంగా ఏదోఒకచోట అనునిత్యం అక్రమరవాణా జరుగుతున్నా నియంత్రించడంలో పోలీసులు విఫలమౌతున్నారన్న విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఈ విషయమై ప్రభాతవార్త నాయుడుపేట డిఎస్‌పిని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట డివిజన్ పరిధిలో ఎక్కడైనా అక్రమార్కులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### తిరుపతి జిల్లా తొలి మహిళ ఎస్పీగా

## మల్లికా గార్గ్ బాధ్యతలు

### ఛాలెంజ్‌ని స్వీకరిస్తా... ప్రజలకు అందుబాటులో ఉంటా...



తిరుపతి క్రైం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా తొలి మహిళ ఎస్పీగా మల్లికా గార్గ్ సోమవారం ఎస్పి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎస్పి మల్లికా గార్గ్ స్వస్థలం ఢిల్లీ కాగా 2015 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారిణిగా పశ్చిమ బెంగాల్ కేడర్‌గా నియమించబడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని చందన్ నగర్‌లో ఏసీపిగా, సిరాంపూర్ ఏసిపిగా , డిప్యూటీ కమాండెంట్ ఆర్ఎఎఫ్ విభాగాల్లో పనిచేసి అనంతరం ఆంధ్ర ప్రదేశ్ క్యాడర్ అధికారిగా బదిలీ అయ్యారు. తరువాత ప్రకాశం జిల్లా ఎస్పిగా విధులు సమర్ధవంత ంగా నిర్వహించి సాధారణ బదిలీపై తిరుపతి జిల్లాకు వచ్చారు.ఎన్నికల సమయంలో ఎలాంటి ఛాలెంజ్ అయినా స్వీకరిస్తా అని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిష్పక్షపాతంగా రాజకీయాలకు అతీతంగా పోలీసు పనితీరు సాగిస్తామని తెలిపారు. ఒక టీంగా పనిచేసి విజయవంతంగా విధులు నిర్వహిస్తామన్నారు. బాధ్యత స్వీకరించిన అనంతరం ఎస్పీని అడ్మిన్ అదనపు ఎస్పి వెంకట్రావు, శాంతి భద్రత అదనపు ఎస్పి కులశేఖర్, క్రైమ్ అదనపు ఎస్పి విమల కుమారి, డిఎస్పిలు సురేందర్ రెడ్డి, నరసప్ప, సిఐలు ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసారు.

## కాణిపాకం ఆలయంలో ఘనంగా నాగప్రతిష్ట



కాణిపాకం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం నాగ ప్రతిష్టలను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. గతంలో దేవస్థానం ప్రధాన ఆలయంలో పాత అద్దాలమండపం వెనుక వైపు నాగ దేవతలు ప్రతిష్టించి వుండేవి. అయితే నూతన అద్దాల మండపం నిర్మాణం కోసం పాత అద్దాల మండపం తొలగింపు సందర్భంగా నాగ దేవతలను అక్కడ నుండి తొలగించారు. ఈనేపథ్యంలో నూతన అద్దాల మండపం నిర్మాణం పూర్తి కావడంతో మండపం వెనుకవైపు తిరిగి సోమవారం నాగదేవతలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే జగన్ లక్ష్యం : రోజా



నింద్ర, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :

గ్రామాల అభివృద్దే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నారని రాష్ట్ర పర్యా టకశాఖా మంత్రి ఆర్‌కెరోజా తెలిపారు.సోమవారం ఎలకాటూరు సచివాలయ పరిధిలో సచివాలయం భవనం రూ40లక్షలు, రు.21.80లక్షల రైతుభరోసాకేంద్రం, రు.20.80లక్షలతో వెల్‌నెస్‌సెంటర్‌ను మంత్రి ప్రారం భించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయం వాలంటీరు వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన తీసుకుని వెళ్ళారన్నారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని,అదే సైన్యంలో పనిచేస్తున్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రోజాకి గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున హారతిలు ఇచ్చి స్వాగతం పలికారు. యంపిపి దీపాజలంధర్‌రాజు, యంపిడిఓ భవాని,తహాశీల్దారు నాగమణి,డిటి నాగరాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి చంద్రబాబురెడ్డి,ఎఇ వీర భద్రం, డియంహెచ్ఓ రవిరాజు,సచివాలయ వైకాపా కన్వీనర్ బాబురెడ్డి,వైస్‌యంపిపి శుభరామ్,కో ఆప్షన్ మెంబరు అనిల్,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు,ఎపియం చంద్రకళ,యంపిటిసి విజేష్ నాయకులు దామోధరం,సింగారం,చంద్రబాబురెడ్డి,తోయజాక్షిరెడ్డి,సుబ్రమణ్యంయాదవ్,శివలింగ ఆచ్చారి, వీరయ్యనాయుడు, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లింట విషాదం

### -నగలు కొనుగోలుకు వెళుతూ ప్రమాదంలో గర్భిణి మృతి



రొంపిచెర్ల,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మండల పరిదిలో జరుగనున్న పెళ్లింట విషాదం నెలకొంది. పెళ్లి నగల కొనుగోలుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో గర్భవతి మృతి చెందిన సంఘటన రొంపిచెర్ల మండలంలో జరిగింది. మృతురాలి భర్త గణేష్ తెలిపిన మేరకు రొంపిచెర్ల మండలంబోడిపాటివారిపల్లె పంచాయతీ కెవిన్ కురవపల్లెకు చెందిన హరిప్రియ(24)ను పీలేరు మండలం కావలిపల్లెకు చెందిన గనేష్‌కు ఇచ్చి 2022లో వివాహం చేశారు. హరిప్రియ ప్రస్తుతం 7వనెల గర్భవతి. అన్న లోకేష్‌కు ఈనెల 13,14 తేదీలలో అన్నమయ్య జిల్లా పీలేరు తితిదే కల్యాణమండపంలో వివాహం జరుగనుంది. ఈ వివాహానికి వారు స్వగ్రామానికి రెండు రోజుల ముందే చేరుకున్నారు. పెళ్లికి బంగారు నగలు కొనుగోలు చేయాలని పీలేరుకు ద్విచక్రవాహనంలో భార్యభర్తలు ఇద్దరు కలిసి బయలు దేరారు.ఈ క్రమంలో తిరుపతి నుంచి రాయచోటికి వెళుతున్న జీపు అతి వేగంగా వచ్చి పెద్దగొట్టిగల్లు శివాలయం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో హరిప్రియ అక్కడికక్కడే మృతి చెందగా భర్త గణేష్‌కు తీవ్రగాయాలైనాయి. విషయం తెలిసిన వెంటనే రొంపిచెర్ల పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.

## మంత్రిచే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



కల్లూరు,ఫిబ్రవరి12 ప్రబాతవార్త

పులిచెర్ల మండలంలో సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఉప ముఖ్యమం త్రి కె.నారాయణ స్వామి ,జిల్లా కలెక్టర షన్మోహన్‌తో కలిసి రూ.29 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు, భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. దిగువపోకల వారిపల్లెలో రూ.3లక్షలతో బస ె సెల్టర్,వెంకటదాసరపల్లెలో రూ.3.29 లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్, మతుకువారిపల్లెలో రూ.17.67లక్షలతో పాలశీతలీకరన కేంద్రంలు ప్రారంభించారు. అదేవిదంగా మతుకువారిపల్లెలో రూ.27.88 కోట్ల విలువ గల ఏపీ రెసిడెన్సియల ె పాఠశాలలు ,బీసీ, ఎస్సీలకు సంబందించి భవన నిర్మానాలకు భూమి పూజ, చల్లావారిపల్లె, కల్లూరులలో రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్,సాదీ మహల్‌కు ప్రారంభోత్సవం ,పాలెం, దేవళంపేటలలో వైఎస్సారు హెల్త్ క్లినిక్‌లు,కల్లూరు-3,దేవళంపేటలో రూ.43.60లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం,రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ ఈ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, ఎపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, సాంఘిక , బీసీ వెల్ఫేర్ అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బాని బాషా, గురుకుల పాఠశాలల డీసీఓ జయబారతి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శివప్రసాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, పిఆర్‌డీఈ చంద్రశేఖర్‌రెడ్డి,పులిచెర్ల ఎంపీడీఓ సురేష్‌బాబు, తహశీల్దారు వసంతలత, ఎంపీపీ సురేంద్రనాదరెడ్డి, జడ్పీటీసీ మురళీధర్, తితిదే మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, అటవీ శాఖ మాజీ డైరెక్టర్ వల్లివేడు పృద్విరెడ్డి,జిల్లా ప్రింటింగు ప్రెస్ అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి,రాయల్‌మోహన్,మండల జేసీ కన్వీనర్ ముర్వత ెబాషా, పోశం జయచంద్రారెడ్డి, లక్ష్మీపతి, మండల స్థాయి నాయకులు, సర్పంచిలు, ఎంపీటీసీలు మహిళలు పాల్గొన్నారు.

## ఆనంకు రాజకీయ భిక్ష మా తండ్రి చలువే

### నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

ఎమ్మెల్యే ఆనంరామనారాయణ రెడ్డికి రాజకీయ బిక్ష పెట్టింది తమ తండ్రి జనార్ధన్ రెడ్డి అని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్లి భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 1989లో ఏ పార్టీకి వెళ్లాలో దిక్కులు చూస్తుండగా జనార్ధన్‌రెడ్డి పిలిచి ఆయన కాంగ్రెస్ లోకి చేర్చుకొని టికెట్ ఇప్పించారని తెలిపారు. తెలుగు గంగ కాలువకు రైతుల కోసం సిఎం జగన్ మోహన్ రెడ్డితో చెప్పినీరువిడుదల చేస్తేమాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, ఎమ్మెల్యే ఆనం విమర్శించడం హాస్యాస్పదంగా ఉన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో అభివృద్ధి జరగకుండా నిరోధకుడగా మారినట్లు విమర్శించారు. ప్రతి అభివృద్ధి పనులు నాకేమిటీ ఆదాయంఅని పాకలాడే వారిని తెలిపారు. తనకు క్యాబినెట్ ర్యాంకు పదవి ఉన్నా ప్రోటోకాల్ పాటించే వ్యక్తి కాదని తెలిపారు. తాను మాత్రం ఆయనకు ప్రోటోకాల్ గౌరవం ఇప్పించాననితెలిపారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల గతంలో తాను జగనన్న వదిలిన బాణం అని ఎన్నికల ప్రచారంలో చెప్పారని ఇప్పుడు మాజీ సిఎం చంద్రబాబు నాయుడు వదిలిన బాణం అని అందరికీ అర్ధమైందన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు దశరథరామిరెడ్డి, శ్రీనివా సులు, నాయకులు మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరి నుంచి పోటీకి సిద్ధం

### ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త




నియోజకవర్గంలో ఏదో ఒక పార్టీనుండి తాను పోటీ చేసేం దుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే ఆనం రామనారా యణరెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వెంకటగిరి నుండే పోటీచేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల గురించి పెట్టించుకోవడం లేదని విమర్శిం చారు. రైతులువర్షాలు లేక కరువతో అల్లాడు తుంటే తెలుగు కాలువ ద్వారానుండి చాలు చాలకొండ నీరు విడుదలచేసినట్లుతెలిపారు.200క్యూసెక్కుల నీటి మాత్రమే విడుదల చేశారని 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఉంటేబాగుండు అనితెలిపారు. రాష్ట్రంలో నిధులు లేకుండా అభివృద్ధి కుంటుపడిం దని తెలిపారు. అన్ని రంగాలు చిన్నా భిన్నమైనట్లుచెప్పారు.సమావేశంలోపలుఅంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపిపి భాస్కర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## "రామ"భగీచా బస్టాండు కష్టాలు!




### కిలోమీటరు దూరంలోనే ఆగిపోతున్న ఆర్టీసి బస్సులు -యాత్రికులకు తప్పని అవస్థలు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆర్టీసి బస్సుల్లో తిరుమలకు విచ్చేస్తున్న భక్తులు "రామ్‌భగీచా"బస్టాండుకు చేరుకునేందుకు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. బస్టాండుకు ఆమడ దూరంలోనే బస్సులను డ్రైవర్లు ఆపేస్తుండటంతో భక్తులు తమతమ లగేజీలను మోసుకురాలేక...చిన్నపిల్లలు, వృద్ధులతో మరీ ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో ఒకరోజు సమస్య అనుకుంటే పొరబడినట్లే. ప్రతిరోజూ తిరుమల రాంభగీచా బస్టాండుకు చేరుకునేందుకు ముందే యాత్రికుల బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. సోమవారం ఉదయం 11.50గంటల ప్రాంతంలో తిరుపతి నుండి వచ్చిన తిరుపతి,మంగళం, అలిపిరి డిపో ఆర్టీసి బస్సులతోబాటు ఎలక్ట్రిక్ బస్సులు కూడా కౌస్తుభం వద్దనే ఆపేయడంతో యాత్రికులు నడచుకుని వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. సాధారణంగా యాత్రికులు ఒకరే అయితే ఎలానో తంటాలు పడివెళతారు.అయితే వారి చేతుల్లో పెద్దపెద్ద లగేజీ బ్యాగులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉండటంతో తంటాలు తప్పడంలేదు. తిరుమల-తిరుపతి మధ్య 400వరకు డీజిల్ బస్సులు ,60వరకు ఎలక్ట్రిక్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు 80వేలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో అత్యధికశాతం 50వేలమంది వరకు యాత్రికులు,టిటిడి ఉద్యోగులు, స్థానికులు ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. రాంభగీచా బస్టాండుకు చేరుకునే తిరుమల బస్సులకు బస్టాండు సమస్య ఎదురవుతోంది. ప్రతి నిమిషానికి ఓ బస్సు కొండపైకి వస్తుండటంతో భక్తులను బస్టాండుకు చేర్చడంలో కొన్ని సందర్భాల్లో ఆమడదూరంలోనే బస్సులు ఆగిపోతున్నాయి. యాత్రికుల సౌలభ్యంకోసం అంజనాద్రి నగర్ ప్రాంతంలో ప్రధాన బాలాజీబస్టాండు ,అదనంగా వెంకన్న ఆలయానికి సమీపంలో రాంభగీచా బస్టాండు ఉన్నాయి. తిరుమలలో దాదాపు మూడు దశాబ్దాల క్రిందట భక్తుల సౌకర్యార్థం ఏర్పాటైన ఆలయానికి సమీపంలోని రాంభగీచా బస్టాండు నేడు పెరిగిన బస్సుల సంఖ్యతో ఇరుకుగా తయారైంది. దీనికి తగ్గట్లు ఎలక్ట్రిక్ బస్సులు 60వరకు చేరడంతో ఈ బస్సులు పదివరకు కొండపైకి బస్టాండుకు వస్తేనే సగం స్థలం ఆక్రమించేస్తున్నాయి. ఈ బస్సులకు పక్కన డీజిల్ బస్సులు కదలడం కష్టంగా మారింది.

## బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, అన్ని రంగాలలో వారు ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా అన్నారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలో ఆడపిల్లల పరిరక్షణకై గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం 1994 అంశంపై నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలలో పాల్గొని గెలుపొంది జిల్లాలో ప్రథమ ద్వితియ, తృతియ స్థానంలో నిలిచిన మొత్తం 9 మంది ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు జిల్లా కలెక్టర్ చేతల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు మొదటి స్థానం పొందిన వారికి 3వేల రూపాయిలు, ద్వితియ బహుమతి పొందిన వారికి రూ. 2000, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 1000 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీహరి, జిల్లా విద్యా శాఖ అధికారి వి. శేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని, డిపిఎంఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వన్నియ కులక్షత్రియ యువతచే కరపత్రాలు పంపిణీ

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లిలో వన్నియకులక్షత్రియ యువతచే సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. వన్నియకులక్షత్రియులకు అండగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు నిలిచారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష ఓట్లు మెజార్టీ సాధించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివం, నేతలు సతీష్, చెక్కునత్తం మణి, రామూర్తి, శివకుమార్, కనకరాజు, గణపతి, రమేష్, గణేష్, రాజశేఖర్, సురేష్, వినోద్, బాబు, ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత వైద్య శిబిరం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

మండలంలోని నూలుకుంటలో సోమవారం ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ మధు మాట్లాడుతూ ప్రజల మేలు కోరే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రతి నెల గ్రామాల్లో ఆరోగ్యరథం సైతం రావడం జరుగుతుందని అలాగే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు,మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత అధ్యక్షుడు సుబ్బు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థిదశనుంచే చేతివృత్తులపై అవగాహన ఉండాలి

**రామకుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** విద్యార్థులకు చిన్నతనం నుంచే తమ చేతి వృత్తులపై అవగాహన ఉండాలని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ రామచంద్రన్ సూచించారు. సోమవారం వృత్తివిద్య కమీషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు చేతివృత్తులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్డీఓచే సచివాలయంలో రిజిస్ట్రేషన్లు పరిశీలన



**శాంతిపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** రాళ్లబూదుగూరులోని సచివాలయంలో చేపడుతున్న రిజిస్ట్రేషన్లను సోమవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈసందర్భంగా వివిధ పథకాలు నోటీసు బోర్డులో తెలపాలని సూచించారు. సచివాలయ రిజిస్ట్రర్లు పరిశీలించారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిటి కౌలేష్, ఆర్ఐ మధు, కార్యదర్శి వనిత, సుబ్రమణ్యం పాల్గొన్నారు.,



## ఎన్ని కేసులు పెట్టినా..రెట్టింపు ఉత్సాహమే

-దేశం నాయకుడు సయ్యద్ సుహేల్

**పుంగనూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** తమ పార్టీ కన్వీనర్ చల్లారామచంద్రారెడ్డితో పాటూ మరో 29 మందిని రౌడీషీటర్లుగా నమోదు చేస్తూ కొత్త చరిత్రకు తెరలేపారనితెలుగుదేశంనాయకుడు,సామాజిక వేత్త సయ్యద్‌సుహేల్ వివరించారు. ఈమేరకు ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైకాపా నాయకులకు భయం పుట్టుకుందన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆదేశాల మేరకుఇప్పటివరకు29మందిపైరౌడీషీట్లుమొదలు పెట్టారని, మరో 200 మంది వరకు నియోజకవర్గంలోని ప్రధాన నాయకులు,కార్యకర్తలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవు తన్నట్లు తెలిసిందన్నారు.

## నియోజకవర్గ బిజెపికు కొత్త నాయకులు

**పుంగనూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో ప్రాభవం పెంచుకుంటున్న బిజిపిను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు కొత్త నాయకులకు మండల బాధ్యతలు రాష్ట్రకమిటీ కట్టబెట్టిందని పార్టీ కన్వీనర్ మదన్‌మోహన్,కోకన్వీనర్ ప్రేమ్‌కుమార్‌లు తెలిపారు. పాతికేళ్ళుగా నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలలో బిజెపికు ప్రజామద్దతు పటిష్టంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని పుంగనూరు పట్టణానికి మఠంబాబు,మండలానికి ఆదినారాయణ,సోమలకు శీలంరామమూర్తి,పులిచర్లకు బండారు మునిరత్నం, సదుంకు ఉమామహేశ్వరరావు,రొంపిచర్లకు వెంటరమణనాయుడులను నియమించినట్లు తెలిపారు. నూతనంగా మండల అధ్యక్షులుగా నియమితులయిన వీరికి బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిఎస్ రాజారెడ్డి, ఏబివిపి రాష్ట్ర నాయకులు జీఆర్ విజయ్‌శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి :పెద్దిరెడ్డి

సదుం ఫిబ్రవరి12ప్రభాతవార్త

భారత రాజ్యాంగనిర్మాత అయిన డాక్టర్‌బీఆర్‌అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అన్నారు. సదుం మండలం అమ్మగారిపల్లె పంచాయతీ గుండ్లూరువారిపల్లెలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా విగ్రహానిని పూలమాల వేసి నివాళులు అర్పించారు. విగ్రహ దాత హైదరాబాదు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రవిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, ఎస్సీ సెల్ జిల్లా వైకాపా అధ్యక్షుడు వెంకటస్వామి, సదుం మండల ఎస్సీ సెల్అధ్యక్షుడు సీతాపతి,గౌరవాధ్యక్షులు మల్లెపల్లె శ్రీనివాసులు, మదనపల్లె ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, అంబేద్కర విగ్రహ కమిటీ సభ్యులు చౌడప్ప, వేణు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను దగా చేసిన జగన్మోహనరెడ్డి

- టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ



చిత్తూరురూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

నిరుద్యోగుల ఓట్లతో ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన జగన్మోహనరెడ్డి నాలుగున్నర సంవత్సరాల తర్వాత తూతూ మంత్రంగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి లక్షలాది మంది నిరుద్యోగులను నట్టేటముంచారని టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సుమారు 12లక్షల మంది నిరుద్యోగ యువత డిఇడి, బిఈడి, ఎంఈడి చేసి సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారనీ, ఎన్నికల సమయంలో తూతూ మంత్రంగా6100 పోస్టులకు మాత్రం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.

## ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సమక్షంలో తెదేపాలో చేరికలు

కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు ఊపందుకుంటున్నాయి. మండలంలోని వి.మిట్టపల్లి పంచాయతీ ఆవులనత్తం, ఎస్సీ కాలనీకి చెందిన పాతిక కుటుంబాలు వార్డు సభ్యుడు చెన్నకేశవతో సహా సోమవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారిని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే కుప్పం మున్సిపల్ పరిధి సామగుట్టపల్లికి చెందిన పలువురు తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేతలు కె.కన్నన్, డా॥ వెంకటేష్‌ల సహాయసహకారాలతో తాము తెదేపాలో చేరామని కుప్పంలో ఈసారి తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష ఓట్ల మెజార్టీ కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో పార్టీ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు చలపతి, లీలావెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం నూతన సచివాలయం ప్రారంభం

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజల సౌకర్యార్థం నూతన సచివాలయాన్ని ప్రారంభించినట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ తెలిపారు. స్థానిక టిబి రోడ్‌లోని జడ్పీ బంగ్లాలో 16,17,22వార్డులకు సంబంధించిన సచివాలయాన్ని రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఇకపై మూడు వార్డుల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈసచివాలయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. సోమవారం నుంచే ఈ సచివాలయం అందుబాటులో తెచ్చామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగయ్య, నాగరాజు, గణపతి, సోమశేఖర్, అరవింద్, జగన్, మునిరాజు, మణి, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, నేతలు సిపి మనోహర్, సతీష్‌కుమార్, సర్దార్, ఇందుశేఖర్, జయశంకర్, రాజా, మంజు, బాబుస్వామి పాల్గొన్నారు.

## ఆలయ కుంబాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల

కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి బండశెట్టిపల్లిలో వెలసిన శ్రీ ఊరిగంగమ్మ ఆలయ కుంబాభిషేక కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, యూనిట్ ఇన్‌చార్జ్ ముత్తు, వార్డు పార్టీ అధ్యక్షుడు హనుమంత, నరసింహులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. అంతకుముందు నారాయణపురంలో ఓ వివాహంకు హాజరై చంద్రబాబుతరపున వధూవరులకు పట్టువస్త్రాలు అందజేశారు.

## బిజెపి నేతలచే పల్లెకుపోదాం కార్యక్రమం

**గుడుపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** మండలంలోని కొడతనపల్లి పంచాయతీలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్ అధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమంను చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పదేళ్ల పాటు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి ప్రజలకు కరపత్రాలు అందించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రుడు, నేతలు సుబ్రమణ్యం, భరత్‌కుమార్, హరికృష్ణ, గంగాధరం, దామోదర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మృత్యుంజయేశ్వరస్వామి సేవలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు



**చౌడేపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** స్థానిక అభీష్టదమృత్యుంజయేశ్వర స్వామిని జడ్పీఛైర్మన్‌జి.శ్రీని వాసులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు స్వాగతం పలికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారుడు చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నడిం పల్లిదామోదర్‌రాజు,ఎంపిపిగాజులరామ్మూర్తి,బోయకొండమాజీఛైర్మన్‌మిద్దింటిశంకరనారాయణ, సర్పంచ్‌శ్రీ రామ్ భరత్‌వరుణ్,ఎంపిటీసీతొండా శ్రీరాములు,రఘుస్వామి పాల్గొన్నారు.

## ఓంశక్తి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయండి

చౌడేపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



ఓంశక్తి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని మహిళా భక్తులు అధికారులను కోరారు. పట్టణంలో రోజురోజుకూ ఓంశక్తి మాల వేసే వారి సంఖ్య గణనీయంగా పెరుగు తోంది. దీంతో అమ్మ వారి ఆలయాన్ని నిర్మించే దిశగా భక్తులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని కాశీవిశ్వే శ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వేనంబర్ 156-4 లోని 0.5సెంట్ల స్థలంకావాలంటూ చిత్తూరు స్పందన కార్యక్రమంలో ఎటకు వినతిపత్ర మందించినట్లు ఓంశక్తి భక్తులు తెలిపారు.

## రేపు కాణిపాకం ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

వసంత పంచమి సందర్భంగా ఈనెల 14న సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించ నున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి,ఈఓ వెంకటేశులు తెలిపారు.స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈకార్యక్రమంను నిర్వ హించన్నుట్లు తెలిపారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించుకునే వారు దేవస్థానంకు 200 రూపాయలు టిక్కెట్ ధర చెల్లించి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు.

## గణనాధుని సన్నిధిలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



**కాణిపాకం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప ్ప సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎంపీ రెడ్డెప్ప వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, స్థానిక నాయకులు గోపీనాధన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఐరాల మండలంలో ఎంపీ రెడ్డెప్ప విస్తృత ప్రచారం



**ఐరాల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప పూతలపట్టు నియోజకవర్గ వైకాపా అభ్యర్థి సునీల్‌కుమార్‌తో కలసి సోమవారం ఐరాల మండలంలోనిపలుగ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని చినకాంపల్లె, వడ్రాంపల్లె, కురవపల్లె తదితర గ్రామాలలో వీరు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.ఐరాలమండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ చింతం మోహన్,కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ జగన్నాధరెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటు

మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



**చిల్లకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త** కార్యకర్తలు మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం కమ్మ వారి పాలెంలోమృతిచెందిననాయకులకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా వుండగా అదే గ్రామం లో హరిజనవాడకు చెందిన బాపనపాటి అబ్రహం అనే యువకుడుగుండె పోటు తోమృతిచెందడంతో సునీల్ కుమార్ నివాళులర్పించారు. ఆయనవెంటనాయకులుపచ్చవ వెంకటే శ్వర్లు నాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు పచ్చవ రాజేశ్వర నాయుడు,నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బూత్ కన్వీనర్‌గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

## అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



గూడూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్ని కల్లో వైఎస్ఆర్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కోరారు. సోమవారం మేఘనూరు, అయ్య వారిపాలెం,కాంద్ర,వెందోడు గ్రామాల్లో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు.సీనియర్ నాయకులు చేవూరు విజ యమోహన్‌రెడ్డి, ఎంపిపిబూదూరు గురవయ్య, 24 సొసైటీ అధ్యక్షులు అట్లశ్రీనివాసులు రెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శికొండూరుసునీల్‌రెడ్డి,రమేష్‌యాదవ్,దయాకర్, కందల సర్పంచి బల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయండి

గూడూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవం తం చేయా లని వామపక్షనాయకులు కాలేషా పిలుపు నిచ్చారు. స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద సిపిఐ నాయకు లు నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. జోగి శివకుమార్,రమణయ్య సురేష్, అడపాల ప్రసాద్,వెంకట రామిరెడ్డి, సుబ్బయ్య, చంద్రయ్య శశి, కలేషా ప్రభాకర్, మణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

చిల్లకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

మండలంలోని రామారెడ్డిపాలెంకు చెందిన ఏలూరు చంద్రశేఖర్ శనివారం రాత్రి ఓ ప్రమాదంలో గాయపడగా సోమవారం సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ద్వారా లక్ష రూపాయిలు నగదును అందచేశారు. సిద్ధుమోహన్,వెంకటేశ్వర్లు,అన్నం మునిశేఖర్, మరి కొంత మంది సీనియర్ క్రికెట్ బృందం ఉన్నారు.

## వైకాపా నేత మృతికి నేదురుమల్లి నివాళులు

వాకాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



మండలపరిధిలోని వావిళ్ళ పాలెంకు చెందిన వైకాపా నేత సుబ్బారెడ్డి మృతదేహాన్ని సోమవారం రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడు సోద రులు పాపా రెడ్డి శశిధర్ రెడ్డి, కోదండరెడ్డి,వాకాడు సొసైటి ఛైర్మన్ దామోదర్ రెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్ పర్సన్ మనోజ్ కుమార్‌రెడ్డి,మాజీమండలపరిషత్‌ఉపాధ్యక్షులు పురు షోత్తం రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, హిమ కుమార్ రెడ్డి, దేవారెడ్డి నాగూర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విగ్రహ ఏర్పాట్లు పరిశీలన

వాకాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదు రుమల్లి జనార్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఆయన తనయుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ పనులను పరిశీలించారు. ఈ నెల 20న జనార్ధన్‌రెడ్డిజయంతిసందర్భంగావిగ్రహా విష్కరణ ప్రారంభోత్స వంకు ప్రముఖులు రానున్నారు.

## విద్యార్థులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర తెలుగుయువతకార్యదర్శికెవికెప్రసాద్ నాయుడు తెలిపారు. స్థానిక ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ సూచన మేరకు మై ఫస్ట్ ఓటు సిబిఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.మాజీఎఎంసిఛైర్మన్‌రాజేశ్వరరావు మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగుల తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లుతెలిపారు.టిఎన్ఎస్ఎస్‌నాయకులు హేమంత్, సుకుమారు, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో వచ్చిన సమస్యలనే పరిష్కరిస్తాం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

స్పందనలో ప్రజలు వింత పత్రాలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని 14వవార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలి పారు. సుదర్శననగర్‌లో ఉన్న 8వ సచివాలయంలో 14వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను గూర్చి అర్జీలుస్వీకరించారు.ఈకార్యక్రమంలోఆయన మాట్లా డుతూ రాష్ట్రానికి దాదాపుగా 16 మంది ముఖ్యమంత్రులు రాగా వారిలో ఏకైకముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు పేద ప్రజలకు సంక్షేమం కుంబెల్ చేశాయని తెలిపారు.ప్రజలందరూ కలిసి 2024లో మళ్లీ మన జగనన్నే ముఖ్యమంత్రి, వెంకటగిరి అభివృద్ధి బాటలో నడవాలి అంటే శాశ్వత అభివృద్ధి పనులు జరగాలంటే అది ఒక నేదురుమల్లి కుటుంబానికి సాధ్యం కాబట్టి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు.

## కార్యకర్తలు నాయకులకు అండగా ఉంటారు

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



పార్టీ నాయకుల్లో కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. అంబలపూడికి చెందిన టిడిపినాయకుడు సముద్రాల మల్లికార్జున సతీమణి వెంకటరమణమ్మ మృతి చెందంతో ఆమె భౌతికాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారి లో మండల అధ్యక్షులు రాయిమస్తాన్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి రాయి సత్య నారాయణ,యూనిట్ ఇంచార్జి తాళ్లూరు ప్రసాద్ నాయుడు, గ్రామ అధ్యక్షులు భాస్కర్,వెంకటగిరి పట్టణప్రధానకార్యదర్శిగల్లాశ్రీనివాసులున్నారు.

## పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవే స్ఫూర్తి

గూడూరు రూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



దేశంలో సినీ అభిమానులను సేవా రంగం వైపు మళ్లించిన ఏకైక వ్యక్తి సినీనటుడు పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి అని,ఆయనను ఆదర్శంగా తీసుకొని తామంతా సేవా రంగం లో కొనసాగుతున్నామని చిరంజీవి యువత నాయకులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు తెలిపారు.

## ఎన్‌సిసి విద్యార్థికి అభినందనలు

**కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సిసి విద్యార్థి అభిషై కీర్తనపాల్‌ను కళాశాలకరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అభినందించారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొని గ్రూప్ సాంగ్‌లో ఎన్‌సిసి విద్యార్థి బంగారు పతకాన్ని సాధించాడు. అంతేకాకుండా క్యాట్, ఎటిసి,ఐజిసి,ఆర్‌డిసి1,2,3లలో వరుసగా ఎంపికయ్యారు. ఆ మేరకు దేశ స్థాయిలో ఈ విద్యార్థి తన అసమాన ప్రతిభ ను చాటినందుకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసీ దుకాణదారులు ఆర్డీఓకు వినతి

కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

కోట ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సొంత నిధులతో గదు లు నిర్మించుకుని చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తరచూ మానసికంగా దుకాణదారులను వేధిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ నాయకుడు ఉదయభాస్కర్‌తో పాటు పలువురు గూడూరు ఆర్డీఓకిరణ్‌కుమార్‌నుకలిసిజగనన్నకుచెబుదాం కార్యక్ర మంలో భాగంగా వినతిపత్రం అందజేశారు. తమ దుకా ణాల అంశం న్యాయస్థానంలో ఉండగా అధికారులు ఇష్టానుసారం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మంచి మనసుతో తమను ఆదుకోవాలని వారు కోరారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** రాష్ట్రంలోని పేదలకుకార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్మమని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రి ఆవరణలో 5 కోట్ల 13 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనాలను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలోఅన్నివసతులు ఏర్పాటు చేయాలన్నదే జగన్‌మో హన్‌రెడ్డి ఉద్దేశమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ పోలూరు పద్మ, కౌన్సిలర్లు సౌజన్య, కడూరు లక్ష్మమ్మ, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం



**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులుస్థానిక ప్రభుత్వా సుపత్రిలో సోమ వారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కార్మిక సంఘనాయ కులుఎం.శేఖర్,హెచ్.వెంకటేశ్వర్లు, పి.రమణ య్య, పిడి రెడ్డి, ఎంఎస్ రావు, పివి కృష్ణయ్య, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో తమిళ రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



సూళ్లూరుపేటబొగ్గులకాలనీలోసోమవారం గోవిందమ్మ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన తమిళనాడు రేషన్ బియ్యాన్ని అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా 5750 కేజీలు బరువుగల 115 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.ఈబియ్యంపి.రామ్మూర్తినాయుడుకు చెందినదిగా సిఎస్ డిటి ఓబయ్య తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు చెప్పారు.

## అక్క చెల్లెళ్ల బాగు కోసం జగనన్న పాలన



**తడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** రాష్ట్రంలోఅక్కా చెల్లెళ్ల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పలు అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేసినట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన తడలో జరిగిన నాలుగో విడత ఆసరా చెక్కులపంపిణీకార్యక్రమంలోపాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి కొళవి రఘురెడ్డి, తడ సర్పంచ్ కె.ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నేత కంకణాల రామ్మోహన్‌రావు మృతి

**ఓజిలి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కంకణాల రామ్మోహన్‌రావు సోమవారం కన్నుమూశారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎటువంటి పదవిని ఆశించకుండా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారు. ప్రజలకోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి శిష్యులుగా పార్టీ కోసం నిరంతరం ఆయన శ్రమించారు. ఆయన మరణ వార్త విన్న మండల ప్రజలు, టీడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# తిరుపతి డివిజన్

## చంద్రగిరిలో సరికొత్త రికార్డ్ సృష్టిస్తాం

**- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి12 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని జోస్యం పలికారు. చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి విజయ ఢంకా మ్రోగిస్తుందని ధీమా వ్యక్తం చేసారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని'-బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటొ కార్యక్రమాన్ని సోమవారం గాంధీపురం గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివర్తి నాని మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన నుండి విముక్తి కల్పించాలని ప్రజలే స్వచ్ఛందంగా కోరుతున్నారని....వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైకాపాకు ధరమగీతం పాడటానికి ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. చంద్రగిరి కోటపై 30 సంవత్సరాలు తర్వాత టిడిపి జెండా ఎగరనున్నదని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సారి 'వైనాట్ చంద్రగిరి' అనే నినాదం ప్రజల్లో బలంగా ఉందని, మంచి మెజార్టీతో గెలవబోతున్నామని స్పష్టం చేసారు. తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ వైకాపా నిరంకుశ పాలకు ప్రజలకు విసిగి వేజారి పోయి ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగిన తెలుగుదేశం పార్టీకి అధికారం కట్టబెట్టడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈసారి 2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అఖండ మెజార్టీతో గెలిపించటానికి నియోజకవర్గ ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బలిజ భవనానికి శాస్త్రోక్తంగా శంకుస్థాపన

**ఆరు నెలల లోపల భవనం పూర్తి**



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కాపుల సంక్షేమానికి ప్రభుత్వం, తాను కట్టుబడి ఉన్నామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఈ నేపధ్యంలో సోమవారం పట్టణానికి చెందిన కాపులు హాజరు కాగా నూతన భవన నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజలు నిర్వహించారు. ఆరునెలల లోపల భవనం పూర్తి చేస్తామని ప్రకటించారు. పట్టణంలోని అయ్యలనాడు చెరువులో కాపుసంక్షేమ భవనానికి స్థలం కేటాయించారు. ఈ స్థలంలో కమ్యూనిటి భవనం నిర్మాణానికి ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఆచరణకు నోచుకోలేదు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టుబట్టి ఇక్కడ కాపు సంక్షేమానికి పాటుపడుతూ ఆశువులు బాసినవంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. సోమవారం ఇక్కడ కాపు సంక్షేమ భవనానికి భూమి పూజలను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ద్వారా జరిపించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగాకలశ స్థాపన గావించారు. వేదపండితులువేద మంత్రాలను పఠిస్తుండగా భూమి పూజ జరిపించారు. ఈ కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, సంఘానికి చెందిన ప్రముఖులు రిటైర్డ్ జడ్జి రాధాకృష్ణ,గాజుల సత్యనారాయణ, ఉప్పు కృష్ణయ్య, పూజల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, మున్నారాయల్, బుల్లెట్ జయశ్యాం,కోలా గోవర్ధన్,చిలకా గోపి, చిలకా రంగయ్య, మందల బాలాజి, పగడాల రాజు, చింతామణి పాండు, సిద్దులుగారి మురళి, డివినారాయణ, సుకుమార్, కోలా వెంకటేశ్వరరావు, ముత్యాల కృష్ణ, లీలా ప్రసాద్, జలకం కిషోర్, పగడాల సుధాకర్,చింతామణి యానాది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో పులివర్తి వినిల్



యర్రావారిపాలెం,ఫిబ్రవరి12 ప్రభాతవార్త : బాబు ష్యూరిటీ భవిష్కత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పులివర్తి నాని తనయుడు పులివర్తి వినిల్ చంద్రగిరి మండలం కూరపర్తివారి పల్లెలో ఇంటింటి మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు అవినీతి,రైడీయిజం, ఇసుక భూ ఆక్రమనలు, ఎర్రచందనం స్మగ్లింగ్ తప్ప ఏమీ జరగలే దన్నారు. ఈమేరకు కరపత్రా లను పంపిణీ చేశారు. 2024 ఎన్నికలలో పులివర్తినానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే బడుగు పేద, బలహీన వర్గాల యువతకు ఉద్యోగ అవకాశాలు, మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజిలు , తలకోన ఆలయ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరింత అభివృద్ధి చేస్తామన్నారు. డీకేటీ భూములను రిజిస్టేషన్ చేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెదేపా, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతి నూతన కలెక్టర్‌ని సత్కరించిన ఎమ్మెల్యే



నారాయణవనం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తిరుపతి నూతన కలెక్టర్గఆ నియమితులైనా లక్ష్మీ షాను తిరుపతి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ గతంలో అక్కడ కలెక్టర్‌గా పని చేసిన వెంకటరమణారెడ్డి బాగానే పని చేసి మంచి పేరు తీసుకున్నారన్నారు. అలాగే తమరు కూడా ప్రజలకు మంచి సేవ చేసి మన్ననలను పొందాలని కోరారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించారు.

## రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే! ఆదరించండి:



శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో అధికారానికి రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని ఆదరించాలని తెలుగుదేశం నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి పిలుపు నిచ్చారు. సోమ వారం ఆమె శ్రీకాళహస్తి మండలంలోని యార్లపూడి గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఆరుపథకాలకు సంబంధించి బాబు ష్యూరిటి లను వివరిస్తూ పర్యటించారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వం అని శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సుధీర్‌రెడ్డి గతం కన్నా అద్భుతంగా అభివృద్ధి చేస్తారని జనాలకు వివరించారు. తెలుగుదేశం ఎప్పుడూ సామాజికాభివృద్దినే కాంక్షిస్తుందని వివరించారు. .ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి,మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెలికం పాపిరెడ్డి, రఘు లు పాల్గొన్నారు.

## భూ బకాసురుల నుంచి పేదల భూములు కాపాండండి-కలెక్టర్‌కు వినతిపత్రం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : రాజీవ్‌నగర్‌లో భూబకాసురుల నుంచి పేదల భూములు కాపాడాలని కోరుతూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీలో భూబకాసురులు రోడ్డుపక్కనే ఉన్న స్థలాన్ని కబ్జాచేస్తున్నారని పట్టపగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇష్టారాజ్యంగా కట్టడాలు కడుతున్నా కనీసం రెవెన్యూ అధికారులు ఆపడానికి ప్రయత్నిం చకపోవడం శోచనీయం అన్నారు. అయితే రాత్రివేళల్లో కూడా సెల్‌ఫోన్ల వెలుగుల్లో అక్రమకట్టడాలు నిర్మిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఇక టైలర్స్ కాలనీలో కూడా పేదలకు ఇచ్చిన పట్టాలను కొందరు కబ్జాదారులు యదేచ్ఛగా స్వాహా చేయడం జరిగిందన్నారు. ఒకసారి రాజీవ్‌నగర్‌లో అక్రమంగా కడుతున్న నిర్మాణాలను చూసి వాటిని తొలగించి నిరుపేదలకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆమెతో పాటు పలువురు రాజీవ్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బిసిలకు పెద్దపీట వేసింది చంద్రబాబు ఒక్కరే



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : బిసిలకు పెద్ద పీఠ వేసింది ఒక్క తెలుగుదేశంపార్టీలోనే అని అది ఒక్క పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు అన్న విషయం వన్నెకుక్షత్రియులు గుర్తించుకోవాలని పలువురు తెదేపా నాయకులు పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వన్నెరెడ్డి కుల నాయకులు రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం పట్టణంలో వైకాపా నాయకులు నిర్వహించిన వన్నెకులక్షత్రియుల ఆత్మీయ సమావేశం జరిగిందని ఈసమావేశంలో వన్నెకులక్షత్రియులకు తెలుగుదేశంపార్టీ ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని స్థానిక శాసనసభ్యుడు మధుసూధన్‌రెడ్డి, వన్నెకులక్షత్రియులకు మరియు ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, భరత్‌కుమార్‌లు మాట్లాడారని, అయితే 1985లోనే తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు సూచనల మేరకు నందమూరి తారకరామారావు శ్రీకాళహస్తి నుంచి శాసనసభకు పంపించారని గుర్తుచేశారు. తుడా ఛైర్మన్‌గా అవకాశం కల్పించడం వాస్తవం కాదా? అని ఎంఎల్‌ని, ఎంఎల్‌సిలు ప్రశ్నించారు. గెలిచే అవకాశం ఇచ్చి శాసనసభ సీట్లు ఇచ్చిన పార్టీ ఒక్క తెలుగుదేశంపార్టీనే అని గుర్తుతెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు కార్యవర్గ కార్యదర్శి ఎంఎస్‌రెడ్డి, సాధికార కమిటీ నాయకులు మిన్నల్‌రవి, రాష్ట్ర యువత మీడియా ప్రతినిధి ప్రతాపరెడ్డి, నియోజకవర్గ బిసి అధ్యక్షులు మాజీ వైస్ ఎంపిపి దొరైరాజ్‌రెడ్డి, పట్టణ బిసిసెల్ నాయకులు పోలూరుశ్రీనివాసులురెడ్డి, ఏర్పేడు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, పార్టీ వన్నెకులక్షత్రియ నాయకులు శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, యువరాజురెడ్డి, రమణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా మంజునాథ్‌గౌడ్



నగరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నగరి మున్సిపల్ కమిషనర్‌గా మంజునాథ్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకే ఉన్న కమిషనర్ దివాకర్‌రెడ్డి బదిలీపై గూడూరు మున్సిపాలిటీకి వెళ్ళడంతో నందికొట్కూరు నుంచి మంజునాథ్‌గౌడ్ నగరి మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు. మున్సిపాలిటీ సంబంధిత వ్యవహారాలపై చురుకుగా వ్యవహరిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఉండాలి : డీఈవో



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నూతన స్కౌట్స్ అండ్ గైడ్స్ బిగినర్స్ కోర్సు శిక్షణ తరగతులు జరిగాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాల నుంచి అత్యధిక స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరు జిల్లా ట్రైనింగ్ కమిషనర్ జి.వెంకటేశ్వర్లు, ఎం.ఎం.రెడ్డి, బాల్య ప్రసాద్ ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించి విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఓర్పు సహనాన్ని, శారీరక అభివృద్ధికి ఈ స్కౌట్స్‌అండ్ గైడ్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందని దానిపైన ప్రత్యేక అవగాహన కల్పించారు. 80 యూనిట్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లా కార్యదర్శి జయరాం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం.కుప్పిరెడ్డి, జిల్లా కార్య నిర్వాహణ గురించి ప్రత్యేకించి తెలియజేశారు. అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ప్రతి స్కూలులో యూనిట్ రిజిస్ట్రేషన్ సమగ్రవంతంగా నిర్వహించి ఈ కార్యక్రమం జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ పూర్తి బాధ్యతగా ఏ.వెంకటేశ్వరులు నిర్వహించారు. కార్యక్రమంలో నాగలాపురం ఎంఈవో రాజు, ఫిజికల్ డైరెక్టర్ బాబు, బాలికల హైస్కూలు హెడ్మాస్టర్ భువనేశ్వరి, రోవర్స్ అండ్ రేంజర్స్ డిజ్టిక్ కో-ఆర్డినేటర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు మంత్రి రోజా పంపిణీ



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పుత్తూరు మండలం కేవీఆర్ పురం గ్రామానికి చెందిన దీపక్‌కుమార్ వారి వైద్యానికి ఖర్చులకు ప్రభుత్వం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కు రూపంలో కేవీఆర్ పురం గ్రామంలో మంత్రి రోజా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన సంక్షేమం జగనన్నకే సాధ్యం - మంత్రి



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: జన సంక్షేమం జగనన్నకే సాధ్యమని మంత్రి రోజా అన్నారు. సోమవారం మండలంలోని కేవీఆర్ పురంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిందన్నారు. ప్రస్తుతం కళ్ళకు కట్టినట్లు అభి వృద్ధి కనిపిస్తోందన్నారు. సచివా లయ, వలంటీర్ల వ్యవస్థలో ప్రజల చెంతకే పాలనను జగనన్న తీసుకెళుతున్నారన్నారు. ఇలా మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ విమలమ్మ, సర్పంచ్ జానకి, సుబ్రహ్మణ్యం, తెలుగు యాదవ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లోకనాథం, పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు కె.టి.ప్రసాద్‌రెడ్డి, ఎం.నరసింహులు, పి.నరసింహులు, దీపక్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రీ సాయి గణేష్ విద్యార్థిని



రేణిగుంట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: రేణిగుంట మండలం గాజులమండ్యం శ్రీ సాయి గణేష్ విద్యాలయం విద్యార్థిని పి.మేఘన రాష్ట్ర స్థాయి ఎంపికై అందరి మన్ననలు పొందుతోంది. శ్రీకాళహస్తిలో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో శ్రీసాయి గణేష్ విద్యార్థిని మేఘన తాను రూపొందించిన ఇంసెక్ట్ ట్రాపింగ్ ఫర్ అగ్రికల్చర్ ప్రాజెక్టును ప్రదర్శనలో ఉంచింది. ప్రాజెక్టు ప్రయోజనాలు సందర్శకులకు వివరించింది. ఆమె ప్రాజెక్టును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, డీఈవో శేఖర్ అభినందించి ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతిని అందజేశారు. ఆమె రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎన్నుకోబడింది. మేఘనను శ్రీ సాయిగణేష్ విద్యాలయ యాజమాన్యం చెంచురెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు అభినందిస్తూ విద్యార్థి దశలోనే బాల శాస్త్రవేత్తగా ఉన్న ఊరికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చిన మేఘన భవిష్యత్‌లో శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి వన్నె తేవాలని ఆకాంక్షించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి!

చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన విచారకర దుర్ఘటన ఆదివారం రాత్రి ఐతేపల్లి వద్ద చోటు చేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు.. తిరుపతి గిరిపురంకు చెందిన ఏకాంబరం తన సొంతూరు పూతలపట్టు మండలం, కిచ్చన్నగారిపల్లి నుండి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పిల్లలకు పుస్తక పఠనం ఎంతో అవసరం



ఏర్పేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పిల్లలకు పుస్తక పఠనం ఎంతో అవసరం అని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ఆవర ణలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను స్థానిక సర్పంచి లలితా కరుణాకర్, మాజీ సర్పంచి తంబా సుబ్రమణ్యం ప్రారంభోత్సవం చేశారు. యన్ ఆర్ ఐ వి ఏ పుస్తక మిత్ర సంస్థ ద్వారా మొత్తం 835 పుస్తకాలను అంధించారు. వీటి విలువ రూ. 40132 అని తెలిపారు. పిల్లలకు ఈపుస్తక ప్రదర్శన ద్వారా పిల్లలకు పుస్తక పరిచయం వాటిని చదివి అలవాటు చేసుకోవడం వంటి చర్యల ద్వారా పిల్లల జ్ఞానం పెంపొంధించడానికి చాలా చక్కటి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మళ్లీ జగనన్ననే ఎన్నుకోవాలి



ఏర్పేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ఈ ఏడు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పార్టీ గుర్తు అయిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగనన్ననే ఎన్నుకునే విదంగా మనమందరం ఓటు వేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధు సూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని మాధవమాల పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికలకు సిద్దం ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా జగనన్న రాష్ట్రంలో ప్రజలకు చేస్తున్న అభివృద్ధి పథకాలను గురించి గడప గడపకు తిరిగి వివరించారు. అదే విధంగా మరొక సారి తన తండ్రి బియ్యపు మదుసూధన్‌రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ గున్నేరి కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షులు రమణయ్య యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు జనార్ధన్ యాదవ్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు నాగార్జున్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బత్తిశెట్టి, సర్పంచి బల్కిష్ బేగం, కరీముల్లా, మహిళా అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎంపీటీసి మునిరత్నంరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జల గోపాకృష్ణారెడ్డి పాలన తీసుకురావాలి



ఏర్పేడు, ఫిబ్రవరి12 ప్రభాతవార్త; శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మళ్లీ దివంగత మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి పాలన తీసుకు రావాలని శ్రీకాళహస్తి టిడిపి ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెల్లూరు పంచాయతీలో విసస్తృతంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ ధర్మ పాలనకు, వైసిపి అవినీతి అక్రమ పాలనకు మద్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొనారు. మంచి పాలన కావాలంటే టడిపి పార్టీ గుర్తు ఐన సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెదేపా గెలిపించుకోవాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో మండల తెదేపా నాయకులు పేరం నాగరాజునాయుడు, శివాజిరెడ్డి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ సులిపురుగుల నివారణ దినోత్సవం



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయ, తిరుపతి ఎన్ఎస్ఎస్ బ్యూరో పాఠశాల ఆఫ్ నర్సింగ్, ఎస్‌పిఎం వివి ఆరోగ్య కేంద్రం సహకారంతో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సుందర్భంగా ఆరోగ్య శాఖలు, ఏపి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. కాబట్టి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గ్రాడ్యుయేట్‌లో ఉన్న విద్యార్థుల కోసం పరిశుభ్రత, ఆరోగ్య ప్రాముఖ్యత, ఆల్బెండజోల్ మాత్రలు, సిరప్‌లుపై అవగాహన ఏ విధంగా నిర్వహించాలో అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ముఖ్య అతిథి గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వివరించారు. ఎం. విద్యావతి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ గంగా భవాని, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా. అనన్య పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది అండర్ గ్రాడ్యుయేల్ విద్యార్థులు పాల్గొని ఆల్బెండజోల్ మందులను స్వీకరించారు.

## భద్రాచల రామదాసు 391వ జయంతి వేడుకలు



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : భద్రాచల రామదాసు 391వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యూజిక్, డాన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగం నందలి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అయిన ప్రొఫెసర్ ఆర్ఎన్ఎస్ శైలేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి భద్రాచల రామదాసు నవరత్న కీర్తనలను డాక్టర్ యు. హిమబిందు, ఇతర స్టాఫ్ సభ్యులు, స్కాలర్సు, స్టూడెంట్స్‌తో కలిపి గోష్టి గానం చేశారు.

## మా భూములకు గిట్టుబాటు ధర కల్పించండి



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : టిటిడి ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఇంటి స్థలాలకు సంబంధించిన భూములకు గిట్టుబాటు ధరలను కల్పించి తతీసుకోవాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్‌చేసారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు పల్లాం గ్రామస్తులు వినతి పత్రాన్ని అందించారు. కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశకు వినతి పత్రం అందిస్తూ తాము ఎంతో కాలంగా ఇక్కడి భూములను అనుభవిస్తున్నామని వివరించారు. కోట్ల విలువ చేసే తమ భూములకు ఎకరానికి రూ.35లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాక తమకు కూడా ఇక్కడ ఇంటినివేశన స్థల పట్టాలుమంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేస్తామని చెప్పటం అన్యాయమన్నారు. గతంలో నాలుగు సంవత్సరాలకు ముందే ప్రభుత్వం ఇంటినివేశన స్థలాలకు మారుమూల ఎకరాకు రూ.18లక్షలు నష్టపరిహారం చెల్లించారని కలెక్టర్ లక్ష్మీశా దృష్టికి తెచ్చారు. ఈ మేరకు గ్రామస్థులు వి.హరిబాబు, వెంకటేశ్వరరావు, శీను, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, పెంచులయ్య, సుబ్బయ్య తదితరుల సారథ్యంలో కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందించారు.

## పెన్షన్లు పెంచిన ఘనత ఒక్క వైకాపా ప్రభుత్వానిదే

**-పెన్షన్ రావడంతోనే ఆనందం..ఓ వృద్ధురాలి మాట..**



.తొట్టంబేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : పెన్షన్లు పెంచిన ఘనత ఒక్క వైకాపా ప్రభుత్వానిదే అని , ప్రతినెలా ఒకటో తేదీ కల్లా పింఛన్ ఇస్తున్నారని ఓ వృద్ధురాలు ఎంఎల్ఏ సతీమణి బియ్యపు శ్రీవాణికి తెలిపింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని బసవయ్య పాళెం, చర్చి కాంపౌండ్, ఎస్టి కాలనీ, జ్ఞానమ్మకండ్రిగ హరిజనవాడ గ్రామాల్లో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్దిదారులతో అండగా నిలచిన తన భర్త బియ్యపుమధుసూధన్‌రెడ్డి ప్రజల ఆశీర్వాదాలు అందించాలని కోరారు. ప్రచారానికి ముందు ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణికి ఎంపిపి ఉన్నం నిర్మల, మండల వైకాపా అధ్యక్షులు, సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడులు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొన్నలిరమేష్, వెంగళరావు, భాస్కర్‌నాయుడు, మురళీనాయుడు, ముకుందనాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారులు నూతన సంఘం ఎన్నిక



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాకు సంబందించి మండల విద్యాశాఖ అధికారులు-2ల సమావేశం సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. అధ్యక్షులుగా పెళ్ళకూరు ఎంఈవో మించల శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా కటారి సతీష్ బాబు, యర్రావారిపాళెం మండల విద్యాశాఖాధికారి కోశాధికారిగా నలుగురు గున్నయ్య, గౌరవాధ్యక్షులుగా బాలయ్య, మహిళా కార్యదర్శిగా పి.కాంచన, అసోసియేషన్ అధ్యక్షుడుగా దయాకర్, కార్యవర్గ సభ్యులుగా డి.మస్తానయ్య, షిరిడి భాస్కర్ బాబు, జనార్ధన్‌రెడ్డి, నసీం ఆలీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రసాభాసాగా యర్రావారిపాలెం మండల సమావేశం



యర్రావారిపాలెం, ఫిబ్రవరి12ప్రభాతవార్త : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన సోమవారం యర్రావారిపాలెం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జగనన్న పక్కా ఇళ్ల నిర్మానం బిల్లులను సకాలంలో చెల్లించలేదని హౌసింగ్ ఏఈ కాంతారావుపై ఎంపీపీ రెడ్డెమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో జగనన్న ఇళ్ల నిర్మానాలను చేపట్టిందని అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పథకం నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులందరికి అందజేయాలని సూచించారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కరునాకర్‌రెడ్డి,మండల ప్రత్యేక ఆహ్వానితులుచెంగల్‌రెడ్డి, తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంపీటీసీలు, సర్పంచిలు, అధికారులు పాల్గొన్నారు.

## 15న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు శిక్షణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 15న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు శిక్షణ ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని బాబుఅగ్రహారం,మున్సిపల్ ఉన్నతపాఠశాలలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి, ఏర్పేడు, కెవిబిపురం మండలాల ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు హాజరు కావాలని డిఈఓ శేఖర్ ఆదేశించారని తిరుపతి జిల్లా భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ టి.రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

**CHANGE OF NAME**

I. **MAILAPADI VENNELLA** (Old name) R/o 10-69 Bharathi Nagar, Newpet, chandragiri, Chittoor Dist. A.P., Have changed my name as **MAILAPADI NANDITHA** (New Name) D/o Mailapadi Ramesh

# హత్య కేసులో నిందితుల అరెస్టు

**వివాహేతర సంబంధమే కారణం**

**హత్యలో పాత్రదారులైన 8 మందిపోలీసుల అదుపులో - సీఐని ప్రశంసించిన డీఎస్పీ**




నగరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ, నెత్తం కండ్రిగ లక్ష్మీపురంలో ఈ నెల 3వ తేదీన వాటర్‌ప్లాంటు యజమాని ఎం.జగదీష్‌ని గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో నరికి చంపిన కేసును నగరి పోలీసులు 9 రోజుల్లో ఛేధించారు. హత్యలో పాత్రదారులైన నెత్తం కండ్రిగకు చెందిన సుధాకర్(40), సత్యవేడు, దాసుకుప్పంకు చెందిన మురళి(37), తిరువళ్లూరు రామదాసుపురంకు చెందిన ఎస్.మగేష్ (40), తిరుపాచూరుకు చెందిన ఏ.అజిత్(27), కడంబత్తూరు అధిగాత్తూరుకు చెందిన హరిహరన్ కుమార్ అలియాస్ వసంత్(23), సూట్‌సూరి(20), రాజముత్తు(24), మనవాల్‌నగర్‌కు చెందిన జయశంకర్ బాలాజీ(24) లను అరెస్టు చేశారు. సోమవారం నిందితులను అరెస్టు చూపారు. డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాల మేరకు వివాహేతర సంబంధమే హత్యకు కారణమైంది. ఆ కోణంలోనే సుధాకర్ అనే వ్యక్తిపై అనుమానంతో కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు సోమవారం ఉదయం గుండ్రాజుకుప్పం డంపింగ్ యార్డు వద్ద సుధాకర్‌ని అతనితో పాటు ఉన్న ఏడుగురిని అదుపులో తీసుకుని అసలు విషయాన్ని రాబట్టారు. సుధాకర్ అద్దెకున్న ఇంటి యజమాని జగదీష్‌కు వివాహేతర సంబంధం ఏర్పడం ఈ కారణంగా వివాదాలు, గొడవలు ఏర్పడిసుధాకర్ భార్యకు విడాకులకు కోర్టును ఆశ్రయించడం జరిగింది. అయినా మానసికంగా జగదీష్‌పై సుధాకర్ కక్ష పెంచుకన్నాడు. తనకు వరుసకు సోదరుడైన సత్యవేడు మండలం, దాసుకుప్పం గ్రామానికి చెందిన మురళితో జగదీష్‌ని చంపేందుకు రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం మేరకు మురళి తన సన్నిహితుడైన మగేష్ ద్వారా తమిళనాడుకు చెందిన అజిత్, హరిహరన్, వసంత్, సూరి, ముకేష్‌లను రంగంలోకి దింపి హత్యకు పథక రచన చేశాడు. 3వ తేదీ రాత్రిజగదీష్ కారు దిగి ఇంటికి వెళ్లే సమయంలో అక్కడే పొదల చాటున దాక్కున్న వసంత్ వేటకత్తితో మృతునిపై దాడి చేయడంతో జగదీష్ మృతిచెందాడు. విచారణలో నిందితుల వద్ద నుంచి రూ.1.37 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, వేటకత్తిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరచారు. కేసును త్వరగా ఛేధించిన సీఐ సురేష్‌ని డీఎస్పీ ప్రశంసించారు.

## స్వామి అమ్మవార్లకు... వెండి దర్పణం బహూకరణ



శ్రీకాళహస్తి,పిబ్రవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించే సమయంలో ఉపయోగించే దర్పాణాన్ని వెండితో తయారు చేసిన దర్పాణాన్ని సోమవారం అందించారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా భోర్డు సభ్యురాలు కొండూరు సునీత, ప్రముఖ వ్యాపార వేత్త కొండూరు నంద(నరసింహారాజులు) ద్వారా అందజేసారు.రూ.1.16లక్షల విలువ చేసే అద్దాన్ని అందజేసారు. ఈ కార్యక్రమాల్లో కొండూరు సునీత, సభ్యులు లక్ష్మీ, రమాప్రభ, శ్రీదేవి,సుమతి, బుల్లెట్ జయశ్యాం, చింతా మణి పాండు,జూలుగంటి సుబ్బారావు,మున్నారాయల్,కంఠా ఉదయ్‌కుమార్, ఆలయ ఎఇఓ ధనపాల్, టెంపుల్ ఇన్సె పెక్టర్ హరియాదవ్,లక్ష్మీపతి,సుబ్బరాయులు, ఆలయ ప్రాధానర్చాకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు అర్థగిరి తదితరులు పాల్గొన్నారు.

## రుద్ర,చండీ హోమాల మండపాలను ప్రారంభించిన ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. సోమవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి నూతనంగా నిర్మించిన రుద్ర,చండీ హోమాల మండపాలను ప్రారంభించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన తరువాత పురాతన కట్టడాలకు కొత్తశోభను కల్పించారు.ఈ నేపధ్యంలో నిత్యం హోమాలు జరిగే చండీ, రుద్రహోమ మండపాలను రూ.13లక్షలతో మరమ్మత్తులు చేసారు.సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రాలతో ప్రారంభించారు. సోమవారం మొదటి రుద్ర, చండీ హోమాలు నిర్వహించారు.

## మినీ బ్రహ్మోత్సవాలకు...కొండంతా అలంకరణలు



తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి: సూర్యజయంతి (రథసప్తమి) పర్వదినం పురస్కరించుకుని కలియుగవైకుంఠం తిరుమల ముస్తాబవుతోంది.16వతేదీ శుక్రవారం ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండల దేవుడు కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా వాహన సేవలకు విచ్చేసే అశేష భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడంతో బాటు ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు నిర్మాణం, జర్మన్‌షెడ్లు ఏర్పాట్లు, రంగరంగుల రంగవల్లులు తీర్చిదిద్దడం వంటి పనులు పూర్తి కావస్తున్నాయి.

## మున్సిపాల్టీకి హైకోర్టు షాక్

**- జిజిఎం ట్రస్ట్ తరపున సిమెంటు బెంచ్‌లు, ఇతర వసతులు ఏర్పాటుకు అనుమతివ్వాలని ఆదేశం**

చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్ర హైకోర్టు షాక్ ఇచ్చింది. జిజిఎం ట్రస్ట్ చిత్తూరు నగర పరిధిలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయదలచిన సిమెంటు బెంచ్‌లు, ఇతర వసతుల కల్పనకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించింది. ఇటీవల జిజిఎం ట్రస్ట్ చిత్తూరు నగర ప్రజల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో సిమెంటు బెంచ్‌లు, ఇతర వసతులు కల్పించడానికి పూనుకొంది. ఈ క్రమంలో చిత్తూరు కట్టమంచి చెరువు సమీపంలోని స్వామి వివేకానందా విగ్రహం పరిసరాల్లో వున్న వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా వాకింగ్‌కు వచ్చే వారి కోసం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేసింది. అయితే మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఇతర మున్సిపల్ అధికారులు హుటాహుటిన అక్కడికి వచ్చి మున్సిపాల్టీ అనుమతి లేకుండా కట్టమంచి చెరువు పరిసరాల్లో ఎలాంటి వసతుల కల్పించరాదని అప్పటికే జిజిఎం ట్రస్ట్ ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచ్‌లు, ఇతర సౌకర్యాలను మున్సిపల్ కార్పొరేషన్ వాహనాల్లో ఎక్కించుకొని తరలించుకెళ్ళారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుకు మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్‌కు సైతం సంఘటనా స్థలంలోనే తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ విషయంపై తెలుగుదేశం నాయకులు మున్సిపాల్టీ ఏకపక్ష నిర్ణయంను సవాల్ చేస్తూ ప్రజల సౌకర్యార్థం తమ ట్రస్ట్ ఏర్పాటు చేపట్టిన పనులను మున్సిపాల్టీ అడ్డుకొందని కోర్టులో కేసు దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు జోక్యం చేసుకొని మున్సిపాల్టీకి మొటిక్కాయలు వేస్తూ జిజిఎం ట్రస్ట్ తరపున ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసే పనులకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించింది.

## ఆరణికి రాజ్యసభ సీటు ఇవ్వాల్సిందే! : బలిజ కార్పొరేటర్లు డిమాండ్

చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: అధికార వైకాపా బలిజ సామాజిక వర్గంను విస్మరించడం పద్ధతి కాదని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఇచ్చిన హామీ మేరకు రాజ్యసభ సభ్యత్వంను వైకాపా అధిష్ఠానం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ళుగా చిత్తూరు నియోజకవర్గంలో వైకాపాకు వెన్నుదన్నుగా నిలిచిన బలిజ సామాజిక వర్గంను ప్రస్తుతం వైకాపా విస్మరించడం తగదన్నారు. రాష్ట్రంలోని 76 నియోజకవర్గాల్లో 20 లక్షల మంది కాపులు వున్నారన్నారు. అయితే ఇందులో 47 నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గానికి అభ్యర్థిత్వం కేటాయించడం అన్యాయమన్నారు. 2019 ఎన్నికల్లో ఆరణి శ్రీనివాసులు 44 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని ఈ పరిస్థితుల్లో ఇక్కడ బలిజ సామాజిక వర్గంకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సిఎం వైఎస్ జగన్ చిత్తూరు నుండి ఇతర సామాజిక వర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కేటాయించి సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న ఆరణి శ్రీనివాసులకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పడం పద్ధతి కాదని వారు విమర్శించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 70 స్థానాల్లో బలిజ ఓటర్లు అధికంగా వున్న విషయంను వైకాపా అధిష్ఠానం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో కో-అప్షన్ సభ్యుడు కోలా కిరణ్, కార్పొరేటర్లు పూర్ణచంద్రరావు, వైకాపా నాయకులు రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: బంగారుపాళ్యం-యాదమరి రహదారి కుర్మాయిపల్లి వద్ద సోమవారం ఉదయం ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. యాదమరి మండలం గుట్టకిందవూరు గ్రామంకు చెందిన మనోజ్(19) ట్రాక్టర్ నడుపుతూ అదుపు తప్పి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సొంత ఇంటి నిర్మాణ పనుల కోసం బోడబండ్ల గ్రామం వద్ద జల్లీ ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని స్వగ్రామంకు వెళ్తుండగా కుర్మాయిపల్లి వద్ద సిక్స్‌లైన్ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన మనోజ్ మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహంను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఎఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాటు సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు



పాలసముద్రం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పాలసముద్రం మండల పరిధిలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పాలసముద్రం పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 1,500 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొన్నారు. ఈ దాడుల్లో అక్కడ సారా తయారు చేస్తున్న కొంతమంది పారిపోవడంతో పోలీసులకు లక్ష్మీ(47) మహిళ పట్టుబడింది. ఈమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

## రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు ప్రారంభోత్సవం



.తొట్టంబేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : మండలంలోని నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవాలకోసం ఎదురుచూస్తున్న రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల భవనాలకు మోక్షం కలిగింది. సోమవారం స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి తొట్టంబేడు, చిట్టత్తూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయ భవనాన్ని ప్రారంభిం చడంతో పాటు, కంచనపల్లి గ్రామంలో సచివాలయ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం తంగేళ్ళపాళెం పిఎసిఎస్ భవనాన్ని రూ.45లక్షలతో నూతనంగా నిర్మించేందుకు భూమిపూజ చేశారు. అనంతరం ఇక్కడే జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైకాపా మండల సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్‌లు సుబ్బయ్య, కంచనపల్లి సర్పంచ్ వి.పద్మ, చిట్టత్తూరుసర్పంచ్ కృష్ణమూర్తి, తంగేళ్లపాళెం పిఎసిఎస్ ఛైర్మన్ పోతుగుంట మణిబాబు నాయుడు, పిఎసిఎస్ సిఈఓ చిరంజీవి, వైకాపా నాయకులు శ్రీరాములురెడ్డి, కోవిచంద్రయ్యనాయుడు, భాస్కర్,పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లు వేశారు..... జీబ్రా లైన్లు మరిచారు!

**-హెచ్చరిక సంకేతాలు లేనందున...అక్కడ ప్రతినిత్యం ప్రమాదాలు**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి12 ప్రభాతవార్త: ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్ నుండి వైకుంతపురం మీదగా వెళ్ళే ప్రధాన రహదారిలో వాహనాల స్పీడ్‌ను అదుపుచేయడానికి, ఇటీవల కాలంలో రోడ్డుకు ఇరువైపుల మూడుచోట్ల స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేసారు. వాహనాల స్పీడును అదుపుచేసి, ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయడం మంచిదే. భద్రతను మెరుగుపరచడం, వాహనాల వేగాన్ని తగ్గించడానికి స్పీడ్ బ్రేకర్స్ ఉపయోగపడతాయి. పాదాచారులకు, నివాస ప్రాంతాలలో, పాఠశాలల సమీపంలో వాహనాల వేగాన్ని తగ్గించడం కోసం రోడ్డుపై ఎత్తుగా స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేస్తారు. కానీ రోడ్డు, స్పీడ్ బ్రేకర్ ఒకేలా ఉండటంతో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసారని విషయం తెలియక వాహనదారులు యాధావిధిగా వాహనాలు నడిపి, బ్రేకర్స్ దగ్గర సడన్‌గా బ్రేక్ వేసి అదుపుతప్పు తున్నారు. ప్రతిరోజు వాహనదారులు ప్రమాదాలకు గురైతున్నారు. ఎమరపాటుతో ద్విచక్ర వాహన దారులు స్పీడ్ అదుపు చేయలేక కిందపడిన ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. వాహనదారుల స్పీడుకు కళ్ళెం వేస్తూ....రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్ వేయడం అందరికి అమోదయో గ్యమైన విషయం. అయితే స్పీడ్ బ్రేకర్స్ ఉన్నా యని సంకేతాలు ఇచ్చే విధంగా బ్రేకర్స్‌పై (నలుపు- తెలుసు) జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయనందున వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, రహదారులకు సంబంధించిన అధికారులు స్పందించి, ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్- వైకుంతపురం మీదగా వెళ్ళే ప్రధాన రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్స్‌కు హెచ్చరిక సంకేతాలుగా జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్స్‌కు జీబ్రాలైన్స్ ఏర్పాటు చేయనందును నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురైతున్నారు.

## మహిళలకు వెన్ను దన్నుగా వైసీపీ - మంత్రి



పుత్తూరురూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: రాష్ట్ర మహిళలకు వెన్ను దన్నుగా వైసీపీ ఉందని, ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటారో అక్కడ దేవతలు ఉంటారని మంత్రి రోజా తెలిపారు. పుత్తూరు ద్రౌపదమ్మ ఆలయ ఆవరణలో సోమవారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా 4వ విడత పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి విధంగా, ఒక కొడుకులాగా ఒక అన్న లాగా ఒక తమ్ముడి లాగా ఒక తండ్రి లాగా ఆడపడుచులను ఆలోచించి చేస్తున్నారడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని తెలిపారు.ఎక్కడ మహిళలు సంతోషంగా ఉంటారో అక్కడ దేవతలు నడయాడుతారని పెద్దలు చెప్పేవారు. ఒక కుటుంబానికి అవసరం వస్తే సొంత వారు చేయకపోయినా జగనన్న మీ కోసం చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నారని తెలిపారు. ఒక పుత్తూరు రూరల్ అర్బన్ కలిపి సంఘాలు మొత్తం 1758 సంఘాలు సభ్యులు 18340 దీనికి గాను వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడు విడతలుగా దాదాపు అక్షరాల రూ.33.87 కోట్ల రూపాయలను ఇప్పటికే అందించడం జరిగిందన్నారు. ఇప్పుడు 4వ విడత కింద ఆసరా ద్వారా అక్షరాల రూ.11.34 కోట్ల రూపాయలను అందించారు. ఒక్క ఆసరా పథకం కింద ఈ నాలుగు సంవత్సరాలుగా నాలుగు విడతలుగా జగనన్న ఇచ్చిన మాట ప్రకారం అక్షరాల రూ.45.39 కోట్ల రూపాయలను అందించారు. సమావేశంలో పుత్తూరు మున్సిపల్ రూరల్, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, బోర్డు డైరెక్టర్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ కన్వీనర్ సచివాలయ కన్వీనర్, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమకు రాళ్ళు కాదు..! రాజధాని కావాలి..!

**తిరుపతి రాజధాని నగరం కానుంది**

**వీర బ్రహ్మేంద్ర స్వామి మాట నిజం కానుంది...కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్**




తిరుపతి సిటీ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : వీర బ్రహేంద్ర స్వామి, ఎన్జీ రంగా గారి స్పూర్తితో తిరుపతి రాజధాని నగరం సాధిస్తాం.. రాయలసీమ వాసులు తమ ప్రాంత అభివృద్ధి, ప్రజలు ఆకాంక్ష ఫలించేలా రాజధాని సాధన కోసం గొంతెత్తాలని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చాంతా మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, యువకులు తిరుపతి రాజధాని కోసం పోరాటం చేయాల్సి మంచి సమయం, సందర్భం ఇదే. 1953లో రావాల్సిన రాజధాని రాకుండా పోయింది. చాలా ఏళ్ళ తరువాత తగిన సమయం వచ్చింది. రాజధాని తప్ప రాయలసీమ అభివృద్ధికి మరో మార్గం లేదన్నారు. తిరుపతి ఉప ఎన్నిక దొంగ ఓట్ల అక్రమాలకు ముఖ్యమంత్రి జగన్ బాధ్యుడు అని తెలిపారు. జగన్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. రాష్ట్రపతి పాలన విధించాలి. సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, దొంగ ఓట్ల అక్రమాలుపై పెద్ద దొంగను వొదిలి, చిన్న హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించకుంటే 2024 ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దొంగ ఓట్లు దౌర్జన్యాలతో గెలవాలని చూస్తున్నారు. 2024లో షర్మిల కాబోయే ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీకి దేవుడు పంపిన దూత షర్మిల అని అన్నారు. షర్మిల పై సోషల్ మీడియా దాడిని ఖండిస్తున్నామన్నారు. ఆమె వెనుక కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు.

## శ్రీచెంగాళమ్మ సేవలో మాజీ డిఆర్‌డిఓ ఛైర్మన్



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని మాజీ డిఆర్‌డిఓ ఛైర్మన్‌జి.సతీష్‌రెడ్డి సోమవారం దర్శించుకు న్నారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెముద్దు పద్మజ, బండి సునీత తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దులో పట్టుబడిన విదేశీ మద్యం



తడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తడ మండలం భీములవారిపాలెం ఎన్నికలతనిఖీ కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున విదేశీ మద్యం బాటిళ్లను పోలీసులుస్వాధీనంచేసుకున్నారు.పోలీసుల కథనం మేరకు, భీములవారిపాలెం తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను నిలిపి పరిశీలిస్తుండగా థాయిలాండ్ దేశం నుంచి వస్తున్న విదేశీ మద్యం బాటిళ్లనుగమనించి పట్టుకున్నారు. ఈ వాహ నంలో థాయిల్యాండ్ నుంచి చెన్నై ఎయిర్‌పోర్టులో దిగిన ముగ్గురు నిందితులు వారి పాస్‌పోర్టుపై ఒక్కొక్కరు రెండేసి మద్యం బాటిళ్లతో పాటు అదనంగా ఒక్కొక్కరు తొమ్మిది మద్యం బాటిళ్లను కొనుగోలుచేశారు.వీరిలో కావలి పట్టణానికి చెందిన ఎం.ప్రసాద్, ఒంగోలుకు చెందిన డి.రవికిషోర్, పశ్చిమగోదావరిజిల్లాగంపవరానికి చెందిన ఎల్.వెంకటరా వులు ఉన్నారు. కావలికి చెందిన సురేష్ వాహనంలో వీరు ప్రయాణిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన విదేశీ మద్యం బాటిళ్లను, కారును స్వాధీనం చేసుకొని తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టర్‌తో నేదురుమల్లి భేటీ



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : నూతన కలెక్టర్ డా. జి. లక్ష్మీశాని మర్యాదపూర్వకంగా వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కలిశారు. నియోజకవర్గసమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. నియోజకవర్గంలోని భూసమస్యలు అర్హులైన వారికి పట్టాలు విషయమై కలెక్టర్ దృష్టికి నేదురుమల్లి తీసు కెళ్లారు. పోలేరమ్మ అమ్మవారి క్యాలెండర్‌ను, ప్రసాదాలను అందజేసారు.

## ద్రవిడ వర్సిటీలో వేతనాలకై తాత్కాలిక ఉద్యోగుల నిరసనలు

**-పాలనాభవనం ఎదుట బైఠాయింపు.. నినాదాలు**



కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ద్రవిడ వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 254మంది తాత్కాలిక ఉద్యోగులు వేతనాలకై నిరసనబాట పట్టారు. సోమవారం మధ్యాహ్నం వర్సిటీ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి తమకు వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. గత ఆర్నెల్లుగా వేతనాలు చెల్లించకున్నా వర్సిటీకి ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా తాము విధులు నిర్వర్తించామన్నారు. అయితే వర్సిటీ అధికారులు మాత్రం మొండివైఖరితో జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. కనీసం ఆటో, బస్సు చార్జీలకు సైతం డబ్బు లేకుండా అవస్థలు పడుతూ విధులకు హాజరవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు ఆర్నెల్ల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మూడు నెలల వేతనాలకోసం రెండు నెలలు సమ్మె చేపడితే జీతాలు ఇచ్చారన్నారు. అనంతరం మరలా జీతాలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. తమ ఆకలి కేకలు పట్టించుకునే నాథులే కరువయ్యారని వాపోయారు. తమకు వేతనాలు చెల్లించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## రోడ్డుపై భద్రత పాటించి..క్షేమంగా చేరాలి..

**-ఆర్టీసి డిఎం సుధాకరయ్య,ఆర్‌టిఐ సుప్రియ**



పుంగనూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : ప్రజలు తమ వాహనాలపై భద్రంగా ప్రయాణించి, రోడ్లపై భద్రత పాటించాలని,క్షేమంగా ఇండ్లకు చేరేలా నిత్యం జీవిత గమనాన్ని పాటించాలని ఆర్టీసి డిఎం సుధాకరయ్య, రవాణా శాఖాధికారిణి సుప్రియలు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతావారోత్స వాలు సందర్భంగా సోమవారం ఉదయం పట్టంలో ఆర్టీసి అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుంగనూరు ఆర్టీసి డిపో నుంచి బస్టాండు, మున్సిపల్ కార్యాలయాల వరకు సాగిన ఈర్యాలీలో ప్రధాన అతిధిగా పాల్గొన్న రవాణాశాఖాధికారిణి సుప్రియ మాట్లాడుతూ వాహనాలను కేవలం ప్రయాణాలకు మాత్రమే ఉపయుక్త మన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మితిమీరి వేగంతో ప్రయాణం చేయడం, చిన్నారులకు తమ వాహనాలు ఇవ్వడం నేరమని గుర్తుంచుకోవాలన్నారు. పిల్లలు వాహనాలు నడిపిన పక్షంలో వారి పెద్దల డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దుచేస్తామన్నారు. వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆర్టీసి మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఎన్.జయరామిరెడ్డి, ఆర్టీసి ట్రాఫిక్,గ్యారేజి సిబ్బంది,రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మౌళిక సదుపాయాల కల్పనలో రాష్ట్రంలోనే ముందంజ : మంత్రి పెద్దిరెడ్డి



రొంపిచెర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : గ్రామాలలో మౌళిక సదుపాయాలు కల్పించడంలో పుంగనూరు నియోజక వర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉందని విద్యుత్ అటవీ పర్యావరణ శాస్త్రసాంకేతిక, భూగర్భగనుల శాఖ మం త్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టరు షన్మోహన్‌తో కలిసి రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెలో రూ.2.57 కోట్లతో నిర్మించిన ఏపీ మోడల్ స్కూల్‌ను ప్రారంభించారు. అదేవిధంగా రూ.29లోలతో పాఠశాలకు వెళ్లే దారికి వేసిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిమిత్తం విద్యా రంగంలో అనేక సంస్కరనలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. విద్యార్థులు విద్యలో బాగా రానించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ,సింగిల్ విండో ఛైర్మెన్ హరినాధరెడ్డి, సర్పంచిలు, ఎంపీటీసీలు, మండల స్థాయి ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

## కుప్పం తొలి డిఎస్పీగా శ్రీనాథ్ బాధ్యతలు



కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త కుప్పం డివిజన్ తొలి డిఎస్పీగా బండారు శ్రీనాథ్ సోమవారం స్థానిక అర్బన్ పిఎస్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డిఎస్పీ శ్రీనాథ్ పాత్రికేయులతో మాట్లాడారు. కుప్పంకు తొలి డిఎస్పీగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అంతకుముందు నూతన డిఎస్పీని రూరల్ సిఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంత్, శివకుమార్, సుమన్‌లు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. కాగా నూతన డిఎస్పీ శ్రీనాథ్‌ను కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెందిల్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా కుప్పం రెవెన్యూ డివిజన్ అయ్యాక తొలిసారి కుప్పం డిఎస్పీగా శ్రీనాథ్ బాధ్యతలు చేపట్టడం విశేషం.